కలెక్టరేట్ స్థల మార్పుపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

నూతన జిల్లా కలెక్టరేట్ స్థల మార్పుపై జిల్లాస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ స్థల మార్పుపై ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. దీనిపై ఒకవైపు జిల్లా ప్రజలు గందరగోళపడుతుంటే మరోవైపు స్పష్టత ఇవ్వాల్సిన అధికారులు, ఎంఎల్‌ఎ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు, దళిత, గిరిజన ప్రజా సంఘాల, ఉద్యోగ సంఘాల నేతలు, మేధావులు, ప్రగతిశీలవాదులు పాల్గొనున్నారని తెలిపారు.

తవ్వించారు.. కొట్టేస్తున్నారు..!

కొల్లేరు రైతుల జీవితాలతో అటవీ శాఖాధికారుల చెలగాటం

చేపల చెరువుల తవ్వకాల్లో ఆ శాఖాధికారులదే కీలకపాత్ర

ఇప్పుడు చెరువులకు గండ్లు కొడుతుండటంతో రైతుల్లో ఆందోళన

మొత్తం 17 వేల ఎకరాల్లో చెరువులకు గండ్లు కొట్టేందుకు ప్రణాళిక

కొంతమంది రైతులను టార్గెట్ చేస్తున్నారంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు పరిధిలోని ఏలూరు, ఉంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, కైకలూరు, మండవల్లి మొత్తం తొమ్మిది మండలాల రైతుల జీవితాలతో అటవీ శాఖాధికారులు చెడుగుడు ఆడుతున్నారు. చేపల చెరువుల తవ్వకాలను అనధికారికంగా ప్రోత్సహించిన ఆ శాఖాధికారులే ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ చెరువులకు గండ్లు కొడుతున్న పరిస్థితి ఉంది. దీంతో కొల్లేరు రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. మొత్తం 17 వేల ఎకరాల్లో చేపల చెరువులకు గండ్లు కొట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆరు వేల ఎకరాల్లో చెరువులకు గండ్లు కొట్టినట్లు తెలుస్తోంది. చెరువులకు గండ్లు కొట్టే వ్యవహారాన్ని అటవీశాఖ అధికారులు గుట్టుగా సాగించడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 43,724 ఎకరాలకు సంబంధించిన 1,776 చేపల చెరువులను ధ్వంసం చేశారు. పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించి, బాంబులు పెట్టి మరీ అప్పట్లో చేపల చెరువుల ధ్వంసం సాగించారు. ఇప్పుడు మాత్రం అత్యంత రహస్యంగా చేపల చెరువులకు గండ్లు కొట్టే వ్యవహారం సాగుతోంది. గతంలో కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చేపల చెరువులకు గండ్లు కొడితే అటవీశాఖ అధికారులు మీడియాకు సమాచారం ఇచ్చి ఫొటోలు సైతం అందించేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితేమీ లేకుండాపోయింది. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2006లో కొల్లేరు ఆపరేషన్ తరహాలో మరో విపత్తు అంటూ కొల్లేరు రైతులు ఘొల్లుమంటున్నారు.

తవ్వించారు.. కొట్టేస్తున్నారు

2006 ఆపరేషన్ కొల్లేరు తర్వాత అక్కడి ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా 14,218 ఎకరాల్లో జిరాయతీ భూముల్లోని చేపల చెరువులను సైతం ప్రభుత్వం ధ్వంసం చేసింది. రైతులకు కనీస పరిహారం కూడా అందించలేదు. దీంతో కొల్లేరు ప్రజలకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. బతుకుదెరువు కోసం కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. జిరాయితీ భూములను తిరిగి అప్పగించాలని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు ఏళ్ల తరబడి పోరాటాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొల్లేరులో ధ్వంసం చేసిన చెరువులను పునరుద్ధరించుకునేందుకు కొంతమంది రైతులు పూనుకున్నారు. అటవీశాఖ అధికారుల సాయంతోనే ఈ ప్రక్రియ సాగింది. రైతుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు తీసుకుని అధికారులు గమ్మున ఉన్నారు. చెరువుల తవ్వకాలకు, ఇతర ఖర్చులకు రైతులు రూ.లక్షల్లో ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ అటవీశాఖ అధికారుల కనుసన్నల్లో తవ్విన చెరువులకే గండ్లు కొడుతున్న పరిస్థితి ఉంది. మొత్తం 17 వేల ఎకరాల్లో చేపల చెరువులకు గండ్లు కొట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో కొల్లేరు రైతులు మంత్రులను, ప్రజాప్రతినిధులను కలిసి లబోదిబోమంటున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలోనూ, ఎంపీ పుట్టా మహేష్, కైకలూరు, దెందులూరు ఉంగుటూరు ఎంఎల్‌ఎల ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం కైకలూరులో జరిగిన సమావేశంలో ఇదే అంశంపై చర్చ సాగింది. చెరువులకు గండ్లు కొట్టకుండా ఆపాలని రైతులు కోరడంతో ప్రజాప్రతినిధులు సైతం అధికారులతో మాట్లాడతామని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

నిడమర్రు మండలంలో చెరువుకు గండికొడుతున్న పొక్లెయిన్

టార్గెట్‌గా వెళ్తున్నారా..?

అటవీ శాఖాధికారులు కొల్లేరు చేపల చెరువులకు గండ్లు కొడుతున్న తీరు అందరిలోనూ పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ముందుగా వందెకరాలకుపైగా ఉన్న చెరువులకు గండ్లు కొడుతున్నట్లు చెబుతున్నా, చిన్నచెరువులకు సైతం గండ్లు కొట్టిన పరిస్థితి ఉంది. ఒక గ్రామంలో కొన్ని చెరువులకు మాత్రమే గండికొడుతున్నట్లు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోని చేపల చెరువుల జోలికి వెళ్లడం లేదనే చర్చ సాగుతోంది. కొంతమందిని టార్గెట్‌గా చేసుకుని చేపల చెరువులకు గండ్లు కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనంతటికీ ప్రధాన కారణం అటవీశాఖ అధికారుల తీరేనని చెప్పొచ్చు. అత్యంత గోప్యంగా ఈ వ్యవహారం సాగించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నేడు పెనుగొండలో చంద్రబాబు పర్యటన

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పెనుగొండ



సిఎం చంద్రబాబు శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ రానున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సిఎం పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలీకాప్టర్‌లో సిఎం బయల్దేరతారు. 11.10 గంటలకు పెనుగొండ-సిద్ధాంతం రోడ్డులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం గుండా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకుని, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 11.50 గంటలకు వాసవి శాంతిధామం నిర్వహిస్తారు. 11.55 గంటలకు గురుపీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారు. 11.55 గంటలనుంచి 12.10 గంటల వరకూ వాసవి శాంతిధామం ఆలయంలో పూజలు చేస్తారు. 12.15 గంటలకు తిరిగి ఎఎంసిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.55 గంటలకు హెలీకాప్టర్‌లో ఉండవల్లి చేరుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

సిఎం రాక నేపథ్యంలో ఎఎంసి వద్ద హెలీప్యాడ్‌లో హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గో బ్యాక్ స్మార్ట్ మీటర్లు

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

స్మార్ట్ మీటర్లు బిగించొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

స్థానిక మెంటే వారి తోటలోని సిపిఎం జిల్లా కార్యాలయానికి రెండో కేటగిరీలో ఉన్న విద్యుత్ కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ బిగింపును సిపిఎం నేతలు అడ్డుకున్నారు. గో బ్యాక్.. గో బ్యాక్ స్మార్ట్ మీటర్లు అంటూ నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్‌తో సిపిఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీంతో కార్యాలయానికి స్మార్ట్ మీటర్ బిగించకుండా సిబ్బంది వెనుదిరిగారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం వీటిని బిగించాలని ముందుకొచ్చిందన్నారు. గతంలో ప్రతిపక్ష నాయకునిగా ఉండగా లోకేష్ దీనిని వ్యతిరేకించారని గుర్తు చేశారు. కూటమి అధికారం చేపట్టాక ప్రస్తుతం వీటిని ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. దీన్ని ప్రజానీకమంతా వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, కౌరు పెద్దిరాజు, నేతలు జుత్తిగ నరసింహమూర్తి, ప్రసాద్, త్రిమూర్తులు, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, విజయకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలేది

నయవంచక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

తమ పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఒక్క పెన్షన్ తప్ప మరే పథకాలు అమలు చేయలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం నయ వంచక విధానాలు అవలంబిస్తుందని మండిపడ్డారు. మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ అని చెప్పి దానిలోని ఒక్క అంశాన్నీ అమలు చేయడం లేదన్నారు. పన్నులు పెంచబోమని చెప్పి విపరీతంగా భారాల వేయడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల సమస్యలు ఊసెత్తడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీల భారాలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

గాంధీ మార్గాన్ని అనుసరించాలి

డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ, అధికారులు

ప్రతిఒక్కరూ జాతిపిత మహాత్మాగాంధీ మార్గాన్ని అనుసరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం మహాత్మాగాంధీ 77వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. స్వాతంత్రం కోసం గాంధీజీ చేసిన అహింసాయుత పోరాటం దేశ ప్రజలకే కాదు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, జిల్లా కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్, విద్యాశాఖ ఎడి ఎన్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ తిరుపతిరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికకు 3న నోటిఫికేషన్

అమలులోకి వచ్చిన మోడల్ కోడ్

జిల్లాలో 69,884 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక కోసం ఈనెల 29న షెడ్యూల్ విడుదలైందని, ఆరోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ ఎన్నికకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల డిఆర్‌ఒలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న ఏలూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, నామినేషన్ల స్వీకరణ ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ ఆఖరు తేదీ అని(ప్రభుత్వ సెలవు దినాలు మినహా), 11న స్క్రూటినీ, 13న ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 27న ఎన్నిక ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు మార్చి 3న ఉంటుందని, మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణపై గురువారం అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలను జారీ చేశారు. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని, పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు బృందాలు, ఎఫ్ఎస్‌టి బృందాలు పనిచేస్తాయని అన్నారు. రూట్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించి, వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్‌డిఒలు గుర్తించాలని తెలిపారు. తహశీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు వెంటనే తమ పరిధిలోనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అన్నిరకాల వసతులు ఉన్నవి లేనిది తనిఖీ చేసుకోవాలని తెలిపారు. వాహనాల కోసం, బాలెట్ బాక్సుల కోసం ఇండెంట్ పెట్టాలని తెలిపారు. బాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ జరుగుతుందని, బాలెట్ బాక్సులను తనిఖీ చేసి, ఆయిలింగ్ చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో 93 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, జిల్లాలోని 20 మండలాల్లో మొత్తం 69,884 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 39,780 మంది పురుషులు కాగా, 30,103 మంది మహిళా ఓటర్లు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారని తెలిపారు. ఫారం-18లో గ్రాడ్యుయేట్ల పేర్లను చేర్చడానికి దరఖాస్తులను ఫిబ్రవరి 10వ తేదీ వరకు అంటే నామినేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ వరకు స్వీకరించవచ్చునని తెలిపారు.

2న మెగా జాబ్‌మేళా

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద తాడేపల్లిలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీలో ఫిబ్రవరి రెండో తేదీ ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మెగా జాబ్‌మేళాలో సుమారు 50కిపైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారుగా రెండు వేల మందికిపైగా ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన వారు ఈ జాబ్‌మేళాకు హాజరు కావొచ్చని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎం రాష్ట్ర మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలో భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ తెలిపారు. గురువారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం రాష్ట్ర మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడానికి డబ్బులు లేవని చెప్పడం శోచనీయమన్నారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుబ్బల గోపీ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజు కాలవను ప్రక్షాళన చేసేవరకు ఆందోళన

పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట కుముదవల్లి గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - పాలకోడేరు

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు, రైతులు

పాలకోడేరు శివారులో ఉన్న రాజు కాలువను ప్రక్షాళన చేయాలని, లేనిపక్షంలో సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని కుముదవల్లి గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు. రాజు కాలవను ప్రక్షాళన చేయాలని, అక్రమ ఇళ్లను తొలగించాలని కోరుతూ గురువారం కుముదవల్లి గ్రామస్తులు, రైతులు పాలకోడేరు పంచాయతీ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాజు కాలవ వెంబడి ఉన్న అక్రమాలు తొలగించి, కాలువను ప్రక్షాళన చేయాలని, తమ గ్రామానికి సురక్షితమైన తాగునీటిని, సాగునీటిని అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భూపతి రాజు శ్రీకృష్ణ వర్మ మాట్లాడుతూ రాజు కాలువకు చేర్చి తమ గ్రామానికి చెందిన వరి సాగు ఆయికట్టు ఉందన్నారు. రాజు కాలువ నుంచే సాగు, తాగునీరు తమ గ్రామానికి సరఫరా అవుతుందని చెప్పారు. అయితే స్థానికంగా ఉన్న అక్రమ కట్టడాల వల్ల తాగునీటి జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గ్రామస్తులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. గతంలో ఈ సమస్యను ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. సమస్య పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. అయితే కొంతమంది ఉద్దేశపూర్వకంగా లేనిపోని ఆరోపణలు చేయడం తగదని విమర్శించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాలకోడేరు నుంచి భీమవరం కలెక్టరేట్ వరకు గ్రామస్తులు, రైతులు ర్యాలీ నిర్వహించి, అక్కడ ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సాగి మధుసూదన్ రాజు, బుద్ధరాజు బలరామరాజు, కలిదిండి సుబ్రహ్మణ్యం రాజు, భూపతిరాజు నాగేంద్ర వర్మ, సాగి సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, భూపతిరాజు పాండురంగరాజు, భూపతిరాజు రంగరాజు, సిహెచ్.నారాయణ రావు, మల్లుల వెంకన్న బాబు, నక్క అప్పలరావు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలి

నిట్ సిఎస్ఇ విభాగం ఆచార్యులు డాక్టర్ వెంకటకృష్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాట్లాడుతున్న వెంకటకృష్ణ

భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదేనని వరంగల్ నిట్ సిఎస్ఇ విభాగం ఆచార్యులు డాక్టర్ వెంకటకృష్ణ తెలిపారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్(ఐఐసి) సహకారంతో జనరేటివ్ ఎఐ అనే అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని తెలిపారు. కంపెనీలు, పరిశ్రమలు, సంస్థలు వంటి పలు రంగాల్లో కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం రోజురోజుకూ పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగానే కొత్త కొత్త ఉద్యోగ అవకాశాలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వివరించారు. ఎపి నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలపై విద్యార్థులు పట్టు సాధించి, సమాజహిత అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలని వివరించారు. అనంతరం కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత, ఉద్యోగ అవకాశాలు వంటి విషయాలపై విద్యార్థుల సందేహాలను డాక్టర్ వెంకటకృష్ణ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ నగేష్ భట్టు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఉండి

జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగ ఎస్ఎఫ్ఐ ఉండి మండల కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఉండి గ్రామంలో అబ్బాయి రాజు పార్క్ ఎదుట నిర్వహించిన రక్తదాన శిబిరం ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఎన్నో కులాలు, ఎన్నో మతాలు, ఎన్నో రకాల భాషలు, విభిన్న ఆచారాలు ఉన్న వారందరినీ ఒక తాటి వైపు నడిపిస్తూ శాంతినే ఆయుధంగా మలుచుకుని, అహింస మార్గంగా సాగుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, స్వాతంత్రాన్ని తీసుకు వచ్చి భారత జాతిపితిగా గాంధీజీ నిలిచారన్నారు. అటువంటి మహనీయులను స్మరించుకుంటూ ఈరోజు రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విద్యారంగంలో సమస్యలకూ, విద్యార్థులకు అండగానే కాకుండా సమాజానికి ఉపయోగపడే ఒక సంఘం అన్నారు. విద్యార్థుల కోసం పోరాటమే కాకుండా విద్యార్థులను ఒక మంచి లక్ష్యం వైపు సాగేలా చూడటం కూడా ఎస్ఎఫ్ఐ కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కె.రోహిత్, మండల సహాయ కార్యదర్శి కె.గోవింద్, మండల కమిటీ సభ్యులు సాగర్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఎంఎల్‌సి ఎన్నికల నియమావళిని పాటించాలి

రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని డిఆర్‌ఒలు, ఆర్‌డిఒలు, తదితరులతో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెయ్యికి పైగా ఓటర్లు ఉంటే వేరే పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈ నెల 31వ తేదీన సమర్పించాలన్నారు. ఈ ప్రతిపాదనలు రాజకీయ పార్టీల సమావేశంలో నిర్ణయం తీసుకొని సమర్పించాల్సి ఉంటుందన్నారు.

సరిపల్లిలో వికలాంగుల పెన్షన్ల పరిశీలన

గణపవరం : మండలంలోని సరిపల్లి గ్రామంలో గురువారం డిజెబులిటి పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించినట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి గురువారం చెప్పారు. 80 మందికి మెడికల్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి గణపవరం డాక్టర్ పి.సంతోష్, ఒంగోలు ఆర్థో వైద్యులు రవికుమార్, నరసాపురం ఏరియా ఆసుపత్రి జనరల్ వైద్యులు డి.సుహాసిని, డిజిటల్ అసిస్టెంట్ హరీష్, గణపవరం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, సరిపల్లి పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉద్యోగుల పునర్నియామకానికి ఎదురుచూపులే

వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ కన్వీనర్ ప్రసాద్

పెనుమంట్ర : ఉద్యోగాలను కోల్పోయిన వైద్య, ఆరోగ్య శాఖలోని దాదాపు వెయ్యి మంది ఆరోగ్యసహాయకులు తమ పునర్నియామకం కోసం మూన్నెళ్లు అవుతున్నా నేటికీ ఎదురుచూపులేనని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పొలమూరులో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలోని పెనుగొండ వాసవీధామ్‌కు శుక్రవారం విచ్చేస్తున్న సందర్భంగా తమ బాధ, ఆవేదన ఆయన దృష్టికి వెళ్లేందుకు ఈ విషయాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పునర్నియామకం చేయాలని కోరారు. ఈ విషయమై తాము రాష్ట్రవ్యాప్తంగా వేడుకోలు పేరిట ఒక కార్యక్రమం ద్వారా మంత్రులందరి దృష్టికీ తమ సమస్య తీసుకెళ్లామన్నారు. కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా తమకు న్యాయం చేస్తుందనే నమ్మకంతోనే తాము వున్నామని ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సత్యం కుటుంబ సభ్యులకు పరామర్శ

భీమవరం టౌన్ : భీమవరంలోని అందే సత్యం కుటుంబ సభ్యులను గురువారం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పరామర్శించారు. సత్యం సతీమణి ఈనెల 27న మృతి చెందారు. ఆమె చిత్రపటానికి ఎంఎల్ఎ అంజిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పొత్తూరి బాపిరాజు తదితరులున్నారు.

గీతకార్మికులకు ఐదు షాపులు

తణుకు రూరల్ : కల్లుగీత కార్మికులకు సంబంధించి విడుదలైన షాపుల నోటిఫికేషన్లు తణుకు ఎక్సైజ్ పరిధిలో ఐదు షాపులు కేటాయించినట్లు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. తణుకు మున్సిపల్, గ్రామీణ పరిధిలో శెట్టిబలిజ, ఇరగవరం, పెనుమంట్ర మండలాల పరిధిలో గౌడ, పెనుగొండ మండల పరిధిలో శెట్టిబలిజ కులాలకు రిజర్వ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఒక వ్యక్తి జిల్లాలో ఎన్ని షాపులకైనా వేసుకోవచ్చు అని కానీ ఒక షాప్ మాత్రమే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఒక్కో అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలుగా ఉందన్నారు. ఈనెల 31న సాయంత్రం ఐదు గంటలకు తణుకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద దీనిపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, సందేశాలు నివృత్తి చేసుకోవడానికి ఔత్సాహికులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

రాజేశ్వరిదేవికి నివాళులు

తణుకు : తణుకు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ యలమర్తి తిమ్మరాజా(వైటి రాజా) తల్లి యలమర్తి రాజేశ్వరిదేవి కీర్తిశేషులైనందున గురువారం తణుకు పట్టణంలోని వారి నివాసంలో రాజేశ్వరిదేవి చిత్రపటానికి పూలమాలు వేసి తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

1 నుంచి వంతులవారీగా సాగునీరు

ఆకివీడు : ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మండలంలో సాగునీరుకు ప్రధాన కాలవైన వెంకయ్యకాలువ వంతుల వారి నీటి విధానం అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి కాలువ, వెంకయ్య కాల్వలకు విడివిడిగా ఒక కాలువకు ఒక్కొక్క వారం చొప్పున ఈ నీటి సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈవిధానం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మార్చి 31 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఫిబ్రవరి ఒకటో తేదీ ఉండి కాలువకు వంతుతో ఈ విధానం మొదలవుతుందని అన్నారు. ఒక్కొక్క కాలువకు ఒక్కొక్క వారం చొప్పున నీరు ఇస్తామన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నిర్ణయించిన విధానం మేరకు ఈ నీటి సరఫరా ఉంటుందన్నారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి విజయానికి కృషి

భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ టిడిపి కూటమి ముఖ్య నాయకుల సమావేశం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎంఎల్‌సి ఎన్నికల అవగాహనా సమావేశాన్ని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ కుటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక ఓట్లతో గెలిపిద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఫిబ్రవరి 27వ తేదీన నిర్వహించబోవు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించడానికి కూటమి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీదేవి, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి పాల్గొన్నారు.

ముగిసిన ఆక్యూ ప్రెజర్ ఉచిత శిబిరం

పెనుమంట్ర : మానవత్వం కలిగివుండి అందరికీ సహాయపడాలని మానవత సంస్థ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ కర్రి వేణుబాబు అన్నారు. గురువారం సాయంత్రం మార్టేరులోని మానవత సంస్థ, ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 రోజుల పాటు జరిగిన ఆక్యూప్రెజర్ ఉచిత చికిత్స శిబిరం ముగింపు సభకు ఆయన అధ్యక్షత వహించి, ప్రశంగించారు. మానవత, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తామని ట్రస్ట్ ఫౌండర్, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి అన్నారు. సుమారు 140 మంది వ్యక్తులకు వారి కాళ్లు పట్టుకొని పరిశీలించి, వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ తాన్ రాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరిలను అందరూ అభినందించారు. జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, మదర్ థెరిస్సా హెల్పింగ్ సంస్థ చైర్మన్ కర్రి మురళీ శ్రీనివాస రెడ్డి, ఎంపిటిసి జి.లక్ష్మణ్ రెడ్డి, సిఎస్.రెడ్డి, కె.సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

కాశిపాడులో కుష్ఠు వ్యాధి నివారణా దినోత్సవం

గణపవరం : కాశిపాడు సచివాలయంలో గురువారం ప్రపంచ కుష్ఠు వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా కుష్ఠు వ్యాధిగ్రస్తులకు క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో మందులు, పళ్లు, దుస్తులు, మిఠాయిలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచి తెర్లి నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పిఎంపి జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు, క్షత్రియ నాయకులు అజయ్‌బాబు, సూర్యరాజు మాట్లాడుతూ కుష్ఠువ్యాధి మైకో బాక్టీరియం అనే బాక్టీరియా ద్వారా వస్తుందని తెలిపారు. ఈక్రిములు తుమ్మంటం, దగ్గటం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతుందని చెప్పారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలవలె ఉండటం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపులుకనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవటం వంటి లక్షణాలు కలిగి ఉంటాయని చెప్పారు. గ్రామంలో ఈనెల 30 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ఇటింటా సర్వేలో భాగంగా దినోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ రమ్య, శివకుమార్ సుధాకరరాజు, పంచాయతీ కార్యదర్శి జాషువా పాల్గొన్నారు.

పలు వ్యాపార దుకాణాల తనిఖీ

నరసాపురం : వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వాడకానికి స్వస్తి పలకాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య వ్యాపారులను హెచ్చరించారు. నరసాపురం పట్టణంలోని పలు వ్యాపార దుఖాణాలను స్వయంగా కమిషనర్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పలు దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. ప్లాస్టిక్ వాడడం వల్ల జరిగే అనర్థాలను వ్యాపారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు, కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దత్త సాయి మందిరంలో అన్న సమారాధన

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబా వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

వీరవాసరం : కొణితివాడలో గెలుపొందించిన దూడకు బహుమతి అందజేస్తున్న ఎడి సుధీర్‌బాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు, టీకాలు వేయించాలని డాక్టర్ బి.అనిల్ కుమార్ సూచించారు. మండలంలోని పడాల గ్రామంలో గురువారం పశు ఆరోగ్య శిబిరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ బి.అనిల్ కుమార్, డాక్టర్ వి.సునీల్ కుమార్ 109 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టాల నివారణ మందు, టీకాలు వేయించాలని, లాభసాటిగా పశువుల పెంపకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్, పశు వైద్య సిబ్బంది సత్యనారాయణ, సువర్ణరాజు, వెంకటేష్, ప్రకాష్, పోసుబాబు, మహేష్ పాల్గొన్నారు.

వీరవాసరం : పశువులకు పెయ్యి(ఆడ) దూడలకు మాత్రమే జన్మనిచ్చే వీర్యం అందుబాటులో ఉందని, పాడి రైతులు ఆ వీర్యాన్ని తమ పశువులకు ఉపయోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ పి.సుధీర్‌బాబు తెలిపారు. పశుసంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఉచిత పశువైద్యశిబిరాన్ని, దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం కొణితివాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ రైతులు తమ పశువులను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను ప్రతీ పశువుకి వేయించాలన్నారు.

పలుచోట్ల పశువైద్య శిబిరాలు

పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయించడం ద్వారా వాటి పునరుత్పత్తి సామర్థ్యంను పెంపొందించుకొని, ఏడాదికి ఒక దూడ పుట్టే విధంగా చేసుకుని, తద్వారా పశువుల సంఖ్యను పెంచుకోవచ్చునన్నారు. ఈ శిబిరంలో 63 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స అందించారు. 40 దూడలకు, 20 గొర్రెలకు నట్టల నివారణా మందులు వేశారు. లేగ దూడల ప్రదర్శనలో యరకరాజు వెంకటరాజు(ప్రథమ), నాగరాజు కనకరాజు (ద్వితీయ), యరకరాజు సుధీర్‌వర్మ దూడలకు(తృతీయ) బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు ప్రియాంక రాబర్ట్, లలిత, మౌర్యసత్యేంద్ర, సుమ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : మేలుజాతి పశువుల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా పశుగణన అభివృద్ధి ఇఒ ఏసురత్నం అన్నారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో గురువారం నిర్వహించిన పశుఆరోగ్య శిబిరం, లేగ దూడల ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశు వైద్యులు ఇచ్చే సలహాలు పాటిస్తూ తమ పశువులను సంరక్షించుకోవాలని సూచించారు. లేగదూడల ప్రదర్శనలో 30 ఆవుదూడలు, గేదె దూడలను రైతులు ప్రదర్శించగా వాటిలో మూడు మేలు జాతి లక్షణాలు కలిగిన దూడలను ఎంపిక చేసి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న రైతుల దూడలకు బలమారుకులు గ్లామర్‌లో నివారణా మందులు అందజేశారు. గ్రామ పెద్దల సహకారంతో మినరల్ మిక్సర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయ సంచాలకులు ప్రమీల, రేలంగి పశు వైద్య అధికారి పివిఎన్‌టివి.ప్రసాద్ పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని కనకాయలంక గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచితపశు వైద్య శిబిరం, లేగ పెయ్యి దూడల అందాల పోటీలను నిర్వహించారు. ఈ అందాల పోటీలలో కనకాయలంక, పెదలంక గ్రామాలకు చెందిన మొత్తం 35 పెయ్యిదూడలు పాల్గొనగా వాటిలో కడలి సత్యనారాయణకు చెందిన పుంగనూరు దూడకు ప్రథమ బహుమతి, యాతం సత్యనారాయణకు చెందిన గేదె దూడకు ద్వితీయ బహుమతి, గెద్దాడ చిట్టి బాబుకు చెందిన గేదె దూడ తృతీయ బహుమతి గెలుచుకున్నాయి. ఈ పోటీలకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.మురళీకృష్ణ, భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జవార్ హుస్సేన్, పాలకొల్లు సబ్ డివిజన్ ఉపసంచాలకులు న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు. అనంతరం యలమంచిలి మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎదకురాని పశువులు, అనారోగ్యంతో ఉన్న సుమారు 50 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స

యలమంచిలిలో..

అందించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 పశువులకు పాముల మందులు, 300 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి రాకుండా టీకాలు, 300 కోళ్లకు కొక్కెర వ్యాధి రాకుండా టీకాలు వేయడంతో పాటు లేగ దూడలు, గొర్రెలు, మేకలకు లివర్ టానిక్‌లు, కాల్షియం మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మద్దా శ్రీనివాసరావు, టిడిపి గ్రామ నాయకులు ముస్కుడి రాంబాబు, సిబ్బంది గ్రంధి ధర్మారావు, సతీష్, సురేష్, దుర్గా భవాని, జాజితా, జగన్, సత్యశ్రీ, షబీర, హేమలత, దొరబాబు పాల్గొన్నారు.

జాతరలు గ్రామ ఐక్యతను చాటుతాయి : ఎంఎల్ఎ

వీరవాసరం : జాతరలు గ్రామ ఐక్యతను, ఔనత్యాన్ని చాటుతాయని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు) అన్నారు. తోలేరు పోలేరు, దండు గంగాలమ్మ జాతర సందర్భంగా గురువారం నిర్వహించిన అన్న సమారాధనను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యర్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి చంద్రశేఖర్, ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, యరకరాజు చినబాబు, కొల్లేపర్ల శ్రీనివాసరావు, కోళ్ల నాగేశ్వరావు, భాస్కర్‌రావులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై ఆరా : వీరవాసరం మండలానికి రూ.3.59 కోట్లతో కొత్తగా వేయనున్న విద్యుత్ సరఫరా లైన్‌పై ఎంఎల్ఎ ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎఇ అప్పారావును అడిగి తెలుసుకున్నారు. వచ్చే వేసవి నాటికి కొత్త విద్యుత్ లైను పనులు పూర్తి చేసి మండల ప్రజలకు కరెంటు కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎఇని ఆదేశించారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహనా ర్యాలీ

భీమవరం టౌన్ : ప్లాస్టిక్ రహిత గ్రామంగా మారుద్దాం అన్న అధికారుల నినాదానికి గ్రామస్తులు, విద్యార్థులు భాగస్వాములై భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ని తరిమికొడదాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ప్లాస్టిక్ వినియోగించడం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ, వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి షాప్‌కి ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని, నిబంధనలను పాటించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, స్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం : విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నిమిత్త శుక్రవారం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ కె.నరసింహమూర్తి గురువారం ప్రకటన విడుదల చేశారు. కొండయ్య చెరువు, నల్లజర్ల రోడ్, పోలీస్ క్వార్టర్స్, శేషామహల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి డౌన్, బిఎస్ఎన్ఎల్ ఎక్సైంజి, కోతి బొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్, రామారావుపేట, హంగ్రీ బర్డ్స్ ఏరియా, కడకట్ల, ఉమెన్స్ కాలేజీ ఏరియాలకు ఉదయం 8 గంటల నుంచి మద్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎఇ తెలిపారు. పట్టణ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇఒపిఆర్‌డి వెంకటేష్‌ను సత్కరిస్తున్న పలువురు

ఇఒపిఆర్‌డి వెంకటేష్‌కు సత్కారం

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం మండల పరిషత్ పంచాయతీల విస్తరణ అధికారి ఎం.వెంకటేష్‌ను గురువారం కొండ్రుప్రోలు పంచాయతీ కార్యదర్శి సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పంచాయతీల విస్తరణకు అధికారి వెంకటేష్ చేసే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉప్పలపాటి బాబురావు, సురేష్, నాగరాజు, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం.రవి కిరణ్, వల్లి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో న్యాయ అవగాహన

నరసాపురం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సీతారాంపురం అంగన్వాడీ కేంద్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ విజయ లక్ష్మి అధ్యక్షతన న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానల్ లాయర్స్ పద్మజ, చాముండేశ్వరి, శిరీషలు హాజరై గర్భస్త శిశు లింగ నిర్ధారణను నివారించడానికి చట్టపరంగా తీసుకొచ్చిన ప్రీ కన్సెప్షన్, ప్రీ నటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ గురించి, వినియోగదారుల రక్షణ చట్టం, చదువుమానేసి వీధుల్లో, హోటళ్లలో, చిన్న దుకాణాలలో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, సంక్షేమ పథకాలు వివరించారు. అనాథలు ఎవరైనా కనబడితే వారిని జిల్లా ఉన్నత శిశుగృహానికి పంపాలని, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1098, 112, దగ్గరలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అంగన్వాడీ సూపర్ వైజర్లు టీచర్స్, హెల్పెర్స్, ఆశా వర్కర్లు ఎక్కువగా ప్రజలలో మమేకమై ఉంటారు కాబట్టి ఈ విషయాలు తెలియజేయాలని ప్యానల్ లాయర్స్ అంగన్వాడీ వర్కర్స్‌ని కోరారు. ఏదైనా వస్తువు కొన్నప్పుడు దానిమీద ఉన్న కాలపరిమితి తేదీని మొదటిగా చూడాలని, రసీదు తప్పనిసరిగా ఉంటేనే ఏదైనా సమస్య వచ్చినపుడు వినియోగదారుల ఫోరంని ఆశ్రయించడానికి హక్కు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ లక్ష్మి, ప్యానల్ లాయర్స్ కె.చిట్టి పద్మజ, డి.చాముండేశ్వరి, కె.నాగ శిరీష, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తల ఘనత అద్వితీయం

వందో ప్రయోగం విజయవంతంపై డిఎన్ఆర్ కళాశాలలో శాస్త్రవేత్తలకు అభినందన

భీమవరం టౌన్ : ఇస్రో చేపట్టిన 100వ ప్రయోగం అద్భుతంగా విజయవంతమైందని, ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఘనతలు అద్వితీయమని భీమవరం డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్రో విజయవంతంపై హర్షం తెలుపుతూ శాస్త్రవేత్తలకు గురువారం అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్ మాట్లాడుతూ 19 నిమిషాల్లోనే కక్ష్యలోకి నావిక్-02 వెళ్లిందని, ఇస్రో చేపట్టిన జిఎస్ఎల్‌వి-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని అన్నారు. భూ జల, వాయు మార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత ఖచ్చితత్వంతో 50 నానోసెకన్ల రియల్ టైంతో చూపించడం ఈ కొత్తతరం ఉపగ్రహాల ప్రత్యేకత అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భారతదేశ సరిహద్దుల 1,500 కిలోమీటర్ల పరిధి వరకూ ఈ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. శాస్త్రవేత్తలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఇసిఇ విద్యార్థులు మౌనిక, ఎ.జ్యోతి ప్రకాష్‌లు మాట్లాడారు. ఇసిఇ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కె.వేణుగోపాల్, ఎస్.రవిచంద్ర, కె.శేఖర్ బాబు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వి.ప్రవీణ్ పాల్గొన్నారు.

'దేశ చరిత్రలో గాంధీ పాత్ర చిరస్మరణీయం'

తాడేపల్లిగూడెం : దేశ చరిత్రలో మహాత్మా గాంధీజీ పాత్ర చిరస్మరణీయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జున రావు(బాబ్జి) అన్నారు. గురువారం స్థానిక గాంధీ మండపం వద్ద మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ మండప నిర్వాహకులు, గాంధీ మండపం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దుర్గా రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో వలవల బాబ్జి మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి మహాత్మా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పట్టణాల రాంపండు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభం మురళీ పాల్గొన్నారు. ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమళ్ల సూరిబాబు ఆధ్వర్యాన ఘన నివాళులర్పించారు. పూర్వ అధ్యక్షులు రాజేంద్ర, దూలం నాగరాజు, కెవి.చలం, కోశాధికారి మల్లారెడ్డి సారథి ఉన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ మొగల్తూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీమకుర్తి అరుణ, గుండు లక్ష్మీ కుమారి, అనంతపల్లి మంగామని, పలువురు సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరులోని చిరంజీవి గ్రంథాలయంలో లైబ్రేరియన్ పిటిఎస్.కుమార్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సువర్ణరాజు, సీమకుర్తి కృష్ణ ఉన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ, కె.స్వరూపరాణి, జివి.శారధ దేవి, షేక్ పర్వీన్, పి.భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురికి సంబంధం లేదు!

పంచాయతీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి

ఉప సర్పంచి వెంకటరాజు, మాజీ సర్పంచి అప్పలరాజు, వార్డు సభ్యులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలకు, గ్రామానికి ముఖ్యులుగా ఉన్న ఆ ముగ్గురికి ఎటువంటి సంబంధం లేదని పాలకోడేరు పంచాయతీ ఉపసర్పంచి, దెందుకూరి వెంకటరాజు, వార్డు సభ్యులు ఆళ్ల నాగేశ్వరరావు, మాజీ సర్పంచి ఆళ్ల అప్పలరాజు స్పష్టం చేశారు. పాలకోడేరు పంచాయతీలో గత నాలుగేళ్ల నుంచి అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి కేవలం 7 నెలలు మాత్రమే పూర్తయిందన్నారు. పంచాయతీలో రూ.2 కోట్ల అవినీతి జరిగిందని, ఆ ముగ్గురిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలకోడేరు పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉప సర్పంచి వెంకట రాజు మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులంతా సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని అడ్డగోలుగా చేసిన తీర్మానాలు, అవినీతిపై ప్రధానంగా చర్చించుకోవడం జరిగిందన్నారు. అయితే గ్రామానికి చెందిన ఆ ముగ్గురు అవినీతికి పాల్పడ్డారంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఇదంతా అవాస్తవమని ఖండించారు. సర్పంచి భర్త లక్ష్మీపతి


మాట్లాడుతున్న ఉప సర్పంచి, వార్డు సభ్యులు

పంచాయతీలో పెత్తనం చెలాయించి, అభివృద్ధికి అడ్డుపడినా సొంత డబ్బులు వెచ్చించి గ్రామస్తుల అవసరాలను తీర్చామని చెప్పారు. సుమారు రూ.13 లక్షలు చేసిన పనులకు బిల్లులు తనకు రావాల్సి ఉందని, ఇవి ఇవ్వకుండా సర్పంచి భర్త అడ్డుపడుతున్నారని ఆరోపించారు. పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచి అప్పలరాజు, వార్డు సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధిపరిచేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందాలి

నరసాపురం : ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందాలనేదే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని బిజిబిస్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ మధుషాలిని అన్నారు. మండలంలో రుస్తుంబాద హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ(ఇపిసిహెచ్) అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు 6 రోజుల శిక్షణను ప్రారంభించారు. ముఖ్య అతిథి బిజిబిస్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ మధుషాలిని జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసి రావు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రయాణించాలని కోరారు. అపర్ణ లక్ష్మి, అడ్డగళ్ల బాబా, రాజీవ్ చంద్ర, ఐఎల్‌టిసి అసిస్టెంట్ మేనేజర్ చినిమిల్లి దివాకర్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన దండా రాజశేఖర్ తండ్రి: దండా శ్రీను అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. కృష్ణాయపాలెం మా ఇంటి నుండి ది. 20-1-2025 న తాడేపల్లిగూడెం మోటార్ సైకిల్ పై వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాస్‌పోర్ట్ నెంబర్ **N7486737** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

దండా రాజశేఖర్
S/o: దండా శ్రీను
కృష్ణాయపాలెం, తాడేపల్లిగూడెం మండలం
ప॥గో॥ జిల్లా - 534146
సెల్: 96038 83774

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం. ఉండి గ్రామం, రాజులపేట, డోర్ నెం. 16-30 కాపరస్తులు కలిదిండి రాజేష్‌వర్మ S/o కలిదిండి రామచంద్రరాజు అను నా యొక్క **ఒరిజినల్ నెం. 818/1964** గల **దస్తావేజును** 8-11-2024 తేదిన ఉండి గ్రామంలో మెయిన్ సెంటర్‌నకు జిరాక్స్ తీసుకోనుటకు నా ఇంటి వద్ద నుండి మోటారు సైకిల్ పై వస్తుండగా మార్గ మధ్యలో జారి పడిపోయినవి. సదరు ఉండి స.రి. వారి ఆఫీసులో **దస్తావేజు** నెం. **818/1964** గల సెటిల్‌మెంట్ ఒరిజినల్ దస్తావేజును నేను దుర్వినియోగపర్చియుండలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

కలిదిండి రాజేష్ వర్మ
S/o: రామచంద్రరాజు
డోర్ నెం. 16-30, ఉండి గ్రామం,
రాజులపేట, ఉండి మండలం, ప॥గో॥జిలా
సెల్: 8688185799

దస్తావేజులు పోయినవి

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన తణుకు మండలం, తణుకు సజ్జాపురం, Flat No.1, Second Floor, V.K.Chary's Mansion కాపురస్తులు తమిరిస వెంకట కృష్ణమాచారి గారి కుమారుడు చారి గోపాల్ గారి తరుపున తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ది. 20-1-2025 సం॥రం॥ తేదీన హైదరాబాద్ నుండి తణుకు 10-30 గం. సమయమున తణుకు వచ్చి తన తాలూకు ది. 11-4-2008 సం॥ తేదీ **రిజిష్టరు ఒరిజినల్ సెటిల్ మెంటు దస్తావేజులు (Doc No. 376/2008), Doc No. 377/2008** లు జిరాక్స్ తీయించుకుని, ఇంటికి వెళ్ళుతూ పళ్ళు కొనుక్కొనుటకు వెంకటేశ్వర దియేటర్ సెంటర్‌లో ఆగి వెళ్ళుచుండగా పైన నుదహరించిన రెండు ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. అవి ఎవరికైనా దొరికిన ఎడల యీ క్రింది నుదహరించిన అడ్రస్సుకు ఇవ్వగోరుచున్నాడు.

వి. సాయికృష్ణ
అడ్వకేట్. తణుకు
సెల్: 94409 65652
తణుకు
29-01-2025

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 58/2014

Between:
Padala Sujata ... ***Plaintiff***
and
1. Karri Veereddy
2. Karri Harika reddy ... ***Defendants***

పై నెంబరు దావా గ్రంధములో 2nd Defendant నకు శ్రీ కోర్టు వారు కోర్టు ద్వారాను, మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికిని తీసుకొనకుండా Avoid చేస్తున్నందున Order 5 Rule 20 ప్రకారం Substitute of Service ద్వారా అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినందున పై నెంబరు దావా గ్రంధములో **ది.18-02-2025 సం॥ తేదీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

A.Dasaradha Ram
Advocate
Tadepalligudem, W.G.Dt
Cell: 70136 60425
Tadepalligudem
Date: 27-01-2025

దస్తావేజు పోయినది

ప॥గో॥జిల్లా, యలమంచిలి మండలం, మేడపాడు గ్రామ కాపురస్తులు శ్రీ యీడేపల్లి హరికంఠ వెంకట రమేష్ S/o వెంకటేశ్వరరావు మాకు ఇచ్చిన సంజాయిషిపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు నానమ్మ గారైన శ్రీమతి యీడేపల్లి దమయంతి రామస్వామి గారు, వారి కుమారుడైన శ్రీ యీడేపల్లి వెంకటేశ్వరరావు గారి పేరున ది. 26-12-2005 సం॥ తేదీన రిజిష్టర్ దాన సెటిల్‌మెంట్ దస్తావేజు వ్రాసి **దస్తావేజు No. 6182/2005** గా పాలకొల్లు సబ్ రిజిష్టారు వారి కార్యాలయంలో రిజిష్టర్ చేసిన దస్తావేజు ఇది. ఈ స్థలం వివరాలు రి.స.నెం. 163/8 సమీప డోర్ నెం. 1-63, హద్దులు, తూర్పు-రోడ్, వెస్ట్-6 అడుగుల ఉమ్మడి రోడ్, నార్త్-ఓదూరి సత్యనారాయణ భూమి కి ఆనుకొని 6 అడుగుల ఉమ్మడి రోడ్, సౌత్-యీడేపల్లి పరమేశ్వరరావు స్థలం ది. 30-12-2024 సం॥ తేదీన మా క్లయింటు జిరాక్స్ తీయించు నిమిత్తం మేడపాడు సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. తదుపరి ఎంత వెదికినను, సదరు దస్తావేజు దొరకలేదు.

కావున సదరు దస్తావేజు ఎవరికైనను దొరికినచో మా క్లయింటునకు అప్పగించవలసినదిగా కోరడమైనది. అందు నిమిత్తం తగు ఖర్చులు యివ్వబడును.

సదరు దస్తావేజు దొరికినవారు మా క్లయింటునకు అందజేయక సదరు దస్తావేజుపై జరిపే లావాదేవీలు మా క్లయింటును బైండోవరు చేయవని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

జి.కె.ఎన్. సింహా M.A.,M.L
అడ్వకేట్.
పాలకొల్లు
సెల్: 94404 39261
పాలకొల్లు
29-01-2025

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIKARABAD DIST. AT: VIKARABAD
O.S.No. 52 OF 2023

Between:
Shakeel Ali Khan. ...Plaintiff.
A N D
Syed Mohammed Hussaini & Others. ...Defendants.

To, Defendant No. 6. Somishetty Sujatha W/o Somishetty Ramesh Babu, Aged about 45 years, Occ: Housewife, R/o H.No. 12-27-1/32, Ikya nagar colony, Flat no. B-11, Reliance Petrol Bunk, Tanaku, A.P. 534211.

Take notice that the Above O.S. No. 52 of 2023 filed for specific performance of agreement of sale Dt. 24-09-2018 in respect Suit schedule property, the above suit is posted on 24-02-2025, for your appearance in person or through advocate, failing which the case will be decided in your absence.

BY ORDER OF THE COURT

Mohd. Mazhar Ali,
Advocate.
H.No.12-2-800/50,
Dilshad Nagar Colony,
Colony, Rethi Bowli, Hyd-28.
Ph: 9246375870.
Counsel for Plaintiff.